

పోలవరం గట్టు గుట్టు..
గప్‌చుప్!

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పోలవరం మట్టి తవ్వకాల్లో గుట్టు తేలట్లేదు. 2.02 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగా, ప్రభుత్వ అవసరాలకు 28.88 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకోవటానికి అనుమతించారు. ఇంకా 1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి ఉండాల్సి ఉండగా, వాటి లెక్కలు తేలట్లేదు. పోలవరం కాల్వగట్టు తవ్వినపుడు మట్టి ఎంత వచ్చింది? ప్రభుత్వ అవసరాలకు అధికారికంగా తవ్వకాలకు ఎంత అనుమతించింది? వివరాలు రికార్డుల్లో ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు మాత్రం అధికారికంగా ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు? మరి మట్టి గుట్టలు ఎలా కరిగిపోయాయి? ఎవరు కరిగించుకుపోయారన్నది తెలియదట. ఇదీ ఘనత వహించిన జలవనరుల శాఖ అధికారుల నిర్వాకం. ప్రభుత్వ అవసరాలకు ఇచ్చింది పోను క్షేత్రస్థాయిలో ఇంకా ఎంత మట్టి ఉందంటే, ముళ్ల కంపలు పెరిగిపోవటం వల్ల అంచనా వేయలేకపోతున్నామని చెబుతున్నారు. ముళ్ల కంపలు ఉంటే మట్టి గుట్టలను అంచనా వేయలేరా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.



1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల పోలవరం మట్టి ఏమైంది?

మట్టి ఎంత ఉందో తెలియదని అధికారుల దాటవేత

- సమాచార హక్కు దరఖాస్తుకు ఇరిగేషన్ అధికారుల స్పందన
- విజిలెన్స్ విభాగానికి కూడా కట్టుకథలతో లెక్కలు చెప్పారా?
- పోలవరం కుడిగట్టులో మొత్తం 2.02 కోట్ల క్యూబిక్ మీటర్ల నిల్వలు
- ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చింది 28.89 లక్షల క్యూబిక్ మీటర్లు
- మిగిలిన మట్టి ఏమైంది అనే ప్రశ్నకు సమాధానం లేదు..



పోలవరం కాల్వ గట్టుపై తవ్వకాలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోలవరం కుడికాల్వపై ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ మాఫియా గుట్టలను కరిగించేసి చదును చేసేసింది. గన్నవరం, నున్న, విజయవాడ, వెలగలేరు సబ్ డివిజన్ల పరిధిలో అడ్డగోలుగా ఈ తవ్వకాలు జరిగాయి. అప్పటి అక్రమ మట్టి తవ్వకాలకు జలవనరుల శాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలవరం మట్టి తవ్వకాలకు సంబంధించి ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపారు. ఇరిగేషన్ అధికారులను వివరణ కోరారు. గతంలో జరిగిన అక్రమాల పాపంలో తాము కూడా భాగస్వాములుగా ఉండటంతో ఇరిగేషన్ అధికారుల వెన్నులో వణుకు పుడుతోంది. దీంతో వాస్తవాలను దాచేస్తున్నారు. విజిలెన్స్‌కు కూడా అరకొర సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన వారికి కూడా అక్రమ తవ్వకాలపై కనీస సమాచారం ఇవ్వట్లేదు. దీంతో జలవనరుల శాఖ అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుయాయులు సాగించిన పోలవరం మట్టి దందాను ఏమీ లేదన్నట్టుగా తేల్చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలానికి చెందిన మెండెం జమలయ్య సమాచార హక్కు చట్టం ద్వారా సంధించిన ప్రశ్నలకు ఇరిగేషన్ అధికారులకు వాస్తవాలను దాచేసి అరకొర సమాచారం ఇచ్చారు.

మిగిలిన మట్టి ఏమైంది?

ఇరిగేషన్ శాఖ అధికారులు కేవలం ప్రభుత్వ శాఖల అవసరాలకు మట్టి ఇచ్చామని చెబుతున్న నేపథ్యంలో గన్నవరం, నున్న, విజయవాడ, వెలగలేరు సబ్ డివిజన్ల పరిధిలో 1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలు ఉండాలి. ఇందులో ఎంత మట్టి ఉందో అధికారులు చెప్పట్లేదు. అదేమంటే మట్టి మీద కంప పెరిగింది, కుదరట్లేదని సమాధానం ఇస్తున్నారు.

గన్నవరంలో కరిగించేసిన మట్టి ఎంత?

గన్నవరం నియోజకవర్గ పరిధిలో పోలవరం కాల్వ గట్టును పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుయాయులు మిగతా 6లో..

రైతులు ఆక్రమించుకున్న వాటికి ఫిర్యాదులు చేశారట

పోలవరం కుడి కాల్వ గట్టు వెంబడి నిల్వ ఉంచిన మట్టి నిల్వలు ఏమైపోయాయో తెలియదు కానీ, కాల్వను ఆనుకుని ఉన్న భూ యజమానులు కాల్వల వెలుపల స్పాయిల్ బ్యాంకులు ఖాళీ ఉన్నచోట్ల కొన్ని ప్రదేశాల్లో నున్న సబ్ డివిజన్ పరిధిలో గొల్లనపల్లి, ముదిరాజుపాలెం, గోపవరపుగూడెం, సూరంపల్లి, నున్న గ్రామాల పరిధిలో మామిడి మొక్కలు నాటారని వాటిని ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు ఇచ్చామని చెప్పారు. విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో కూడా నున్న, పాతపాడు, పీ నైనవరం, జక్కంపూడి గ్రామాల్లోని కొన్ని ప్రదేశాలలో పై విధంగానే ఆక్రమణలు జరిగాయని తెలిపారు. ఈ విషయాలు తెలిసిన అధికారులకు మిగిలిన మట్టి నిల్వలు ఏమైపోయాయో తెలియకపోవటం గమనార్హం.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

నెలాఖరు వరకు వరుసగా వర్షాలు

మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు

ప్రజలకు ముందస్తు ఉపశమనం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వేసవి ఉష్ణోగ్రతల నమోదులో అందరికి ముందుగా గుర్తుకు వచ్చేది రెంటచింతల. ఆ తర్వాత టక్కున చెప్పే పేరు విజయవాడ. ఎండాకాలంలో అన్ని ప్రాంతాలు మండిపోతుంటాయి. కాకపోతే ఈ రెండు ప్రాంతాల్లో మంటలు అన్నింటి కంటే ఎక్కువగా ఉంటాయి. వేసవికాలం రోజులు అడుగు పెట్టడానికి ముందు నుంచి ఉమ్మడి జిల్లాకు సెగ తగులుతుంది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా కేంద్రంగా ఉండే విజయవాడ ప్రజలను ఇది ఎక్కువగా తాకుతుంది. సాధారణ రోజుల్లోనే విజయవాడలో ఎండలు కాస్త ఎక్కువగా ఉంటాయి. అదే వేసవిలో నమోదయ్యే ఉష్ణోగ్రతలకు ప్రజలు అల్లాడిపోతుంటారు. ఇక రోహిణికార్తె ప్రారంభమైతే జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి గడగడలాడిపోతుంటారు. ప్రతి ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలకు ఇది తప్పని పరిస్థితి. ఈ ఏడాది మాత్రం జిల్లాకు ముందస్తు ఉపశమనం లభించింది. రోహిణి కార్తె మొదలయ్యే రోజు నుంచి అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఇప్పుడు రోహిణి వచ్చిన నాటి నుంచి జిల్లా ప్రజలను చల్లదనంతో చినుకులు పలకరించాయి. ఈ వర్షాల పరంపర జూన్ వరకు మిగతా 6లో..

గాలుల దిశ మారుతోంది

వేసవిలో ఉత్తర, పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయి. ఈ గాలులు రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతం నుంచి వస్తాయి. దీనివల్ల మనకు వేడి ఎక్కువగా ఉంటుంది. జూన్ నెలలో ఈ గాలుల స్థానంలో దక్షిణ, పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయి. వాటి వల్ల వాతావరణంలో చల్లదనం చేరుతుంది. ఈ ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయి. సాధారణంగా జూన్‌లో వస్తాయని అంచనా వేసిన రుతు పవనాలు ఈసారి ముందుగానే తెలుగుగడ్డను తాకుతున్నాయి. రుతు పవనాలు వచ్చినప్పుడు ఎలాగూ వర్షాలు కురుస్తాయి. దీనికి ముందు బంగాళాఖాతం, అరేబియ సముద్ర గర్భంలో ఏర్పడిన అల్పపీడనంతో కొన్ని రోజులపాటు వరుసగా ప్రతిరోజు వర్షాలు కురుస్తాయి.

- కె.సత్యనారాయణ, వాతావరణ నిపుణుడు

టీడీపీ పండుగకు వేళాయె!

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 20 వేల మంది పయనం

- ఒక్కో నియోజకవర్గం నుంచి 2 వేల మంది కార్యకర్తలు, 500 మంది నాయకులు
- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రతిపాదనతో రెండు జిల్లాల అధ్యక్షులు నెట్టెం, కొనకళ్ల
- కడపలో 27 నుంచి టీడీపీ రాష్ట్ర మహానాడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కడపలో ఈ నెల 27 నుంచి జరిగే రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడుకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 20 వేల మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లనున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి రెండు వేల మంది కార్యకర్తలు, 500 మంది నాయకులు బయలుదేరుతున్నారు. మండల, జిల్లా నాయకత్వాలతో సహా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి మొత్తం 20 వేల మంది వెళ్తున్నట్టు సమాచారం. ఇప్పటికే కార్లు, బస్సులు బుక్ చేసుకున్నట్టు తెలిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా లేకుండా పార్టీ శ్రేణులు కృషి చేశాయి. అధికారంలోకి వచ్చాక జరుగుతున్న మహానాడు కావడంతో అనేక ఆశలతో వెళ్తున్నారు.

మహానాడు దృష్టికి పలు తీర్మానాలు

నియోజకవర్గాల స్థాయి, జిల్లాల స్థాయిలో నిర్వహించిన మినీ మహానాడుల్లో సైతం పలు తీర్మానాలు చేయటం జరిగింది. రెండు జిల్లాల అధ్యక్షులు నెట్టెం రఘురామ్, కొనకళ్ల నారాయణరావు సంయుక్తంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్న ప్రతిపాదనతో మహానాడుకు వెళుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అనేక సమస్యలను పార్టీ దృష్టికి తీసుకు రావటానికి తీర్మానాలు చేశారు. బుడమేరు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, జీ కొండూరులో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని, వీటీపీఎస్ నుంచి విడుదలవుతున్న బూడిత కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని, ఏడు నియోజకవర్గాల్లో అహర్నిశలూ పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, తూర్పు నియోజకవర్గంలో రీటైనింగ్ వాల్ వెంబడి పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, విజయవాడ నగరంలో యూజీడీ మెరుగు పరచాలని, వత్సవాయి మండలం పోలంపల్లి మున్నేరుపై నిర్మించిన ఆనకట్ట గండ్లు పూడ్చాలని, గుణదలలో ఆగిపోయిన ఫ్లై ఓవర్‌ను పునరుద్ధరించాలని, పశ్చిమలో హజ్ హౌస్ పూర్తి చేయాలని, తిరువూరులో సురక్షిత నదీజలాల ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రతిపాదనలతో నేతలు మహానాడుకు తరలివెళుతున్నారు.

ఈ చేపలు తింటే అంతే!

కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం

మైలవరం, తిరువూరు ఏరియాలో కొందరి నిర్వాకం

- నగరాలు, పట్టణాల నుంచి యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల తరలింపు
- పట్టించుకోని అధికారులు.. పొంచి ఉన్న అనారోగ్య సమస్యలు

నగరంలోని కోళ్ల వ్యర్థాలన్నీ మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు భారీగా డంప్ అవుతున్నాయి. ఇక్కడి చేపల చెరువుల యజమానుల్లో కొందరు వీటినే చేపల మేతగా వినియోగిస్తున్నారు. త్వరగా బరువు పెరగటం వల్ల ఆరు నెలలకు రావాల్సిన చేపలు మూడు నెలలకే వచ్చేస్తున్నాయి. దీంతో దిగుబడి ఏడాదిలో నాలుగుసార్లు వస్తోంది. అయితే ఈ చేపలు తింటే మాత్రం వచ్చే అనర్థాలు అన్నీ, ఇన్నీ కావు. పర్యవేక్షించాల్సిన అన్ని వ్యవస్థలు మామూళ్ల మత్తులో జోగుతున్నాయి.



విజయవాడ రూరల్ మండలంలో చేపల చెరువులో తేలియాడుతున్న కోళ్ల వ్యర్థాలు



విస్సన్నపేట చేపల చెరువు వద్ద చేపల మేతగా వేసేందుకు తెచ్చిన కుళ్లిన పశువుల కళేబరాలు

(ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట/ జి.కొండూరు/ ఇబ్రహీంపట్నం/రెడ్డిగూడెం): జిల్లాలోని మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లో, తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలంలో ఉన్న చెరువుల్లో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున చేపల సాగు చేపట్టారు. మైలవరం నియోజకవర్గంలోని భూములు పంటలకు పనికి రావడం లేదని అనధికారికంగా చేపల చెరువులు తవ్వే స్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి పెద్ద ఎత్తున చేపల సాగు చేస్తున్నారు.

మేతగా కోళ్లు, పశువుల వ్యర్థాలు

చేపల పెరుగుదలకు కోళ్లు, పశువుల వ్యర్థాలను కొందరు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. నగరంతో పాటు ఆయా పట్టణాల్లో ఉండే చికెన్, మటన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి, వాటిని వ్యానుల్లో డ్రమ్ముల ద్వారా తీసుకొచ్చి నేరుగా చేపల చెరువుల్లో పడేస్తున్నారు. వందల సంఖ్యలో వ్యాన్లు దర్జాగా కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. మత్స్య, రెవెన్యూ, ఫుడ్ అండ్ సేఫ్టీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు నెలవారి మామూళ్లు అందబట్టే వారు వీటిని అడ్డుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిషేధిత చేపల పెంపకం

నిషేధిత జాబితాలోని క్యాట్‌ఫిష్, పాంగాసియస్ వంటి చేపలను ఇక్కడ పెంచుతున్నట్టు సమాచారం. వీటిని నగరాల్లోని పెద్ద హోటల్స్ తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. చేపల చెరువులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడంలేదని విమర్శలు ఉన్నాయి. చేపల చెరువుల్లో నీరు పచ్చగా మారిపోతున్నాయి. కోళ్ల వ్యర్థాలు వేయడం వల్ల అపరిశుభ్రంగా తయారై దోమలు, ఈగలకు ఆవాసంగా ఉంటున్నాయి.

నీటి వనరులు ఉన్నచోటే సాగు

నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం మిగతా 6లో..

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

50వ డివిజన్ జెండా చెట్టు సమీపంలో ఘటన



మానస్ మృతదేహం

చిట్టినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆడుకోవడానికి బయటకు వెళ్లిన బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంతంలోని జెండాచెట్టు సమీపంలో టి.లలిత కుటుంబంతో నివాసం ఉంటుంది. కొన్నేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్నవాడైన టి.మానస్ (8) మూడవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో ఆడుకుంటూ ఆ పక్కనే ఉన్న బడ్డీని పట్టుకున్నాడు. బడ్డీకి విద్యుత్ సరఫరా కావడంతో పట్టుకోగానే మానస్ విద్యుత్ షాక్ తగిలి గిలగిలా కొట్టుకుంటున్నాడు. పక్కనే ఆడుకుంటున్న పిల్లలు చూసి విషయాన్ని బాబు మామయ్య చింతా రాజుకు తెలియజేశారు. వెంటనే ఆయన బాబును లాగడంతో అప్పటికే మానస్ స్పృహ కోల్పోయాడు. వెంటనే పాత ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బడ్డీలోని బల్బు వైరు కట్ అవ్వడం కారణంగానే విద్యుత్ సరఫరా బడ్డీకి వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం : కార్పొరేటర్ బోయి సత్యబాబు

అధికారుల నిర్లక్ష్యమే బాలుడి మృతికి కారణమని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆరోపించారు. పాత ప్రభుత్వాస్పత్రిలో బాలుడు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజన్‌లో ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లు తొలగించాలని ఈ నెల 16న జరిగిన విద్యుత్ అదాలత్‌లో వినతిపత్రం ఇచ్చానని తెలిపారు. ఈ ప్రమాదానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జెడ్పీ బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు

ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు అంటూ సంకేతాలు

ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువు

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

లభించని భరోసా.. వెంటాడుతున్న బదిలీల భయం



జెడ్పీ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీలపై పంచాయతీరాజ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ నెల 22వ తేదీన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునే వారికి వెసులుబాటు కల్పించారు. వివిధ యూనియన్‌లలో ఆఫీస్ బేరర్లుగా పనిచేస్తున్న వారికి, ఐదు నెలల్లోపు పదవీ విరమణ చేసేవారికి, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడేవారికి బదిలీల నుంచి మినహాయింపును ఇచ్చారు. బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించి, ఖాళీలు ఉన్న ప్రాంతాల్లో ఉద్యోగులు తమకు ఇష్టమైన ప్రాంతాన్ని కోరుకుంటే, అక్కడకు బదిలీ అయ్యే అవకాశం కల్పించారు. దీంతో పాటు ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘిస్తే జెడ్పీ సీఈవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కీలకమైన పాయింట్‌లను తొలగించిన జిల్లాపరిషత్ అధికారులు తమ చిత్తానుసారంగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మిగతా 6లో..

ప్రభుత్వం అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విధివిధానాలను విడుదల చేసింది. అయితే ఏ శాఖలో లేని విధంగా జిల్లా పరిషత్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు చేసి బదిలీలు చేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతుండటంతో ఆ విభాగంలోని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారంతో ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలసి విజ్ఞప్తి చేస్తే, ఈ విషయంపై తన వద్దకు రావద్దని, కొద్దిపాటి మార్పులతో బదిలీలు జరుగుతాయని చెప్పడంతో ఉద్యోగులు కంగుతిన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసినా భరోసా లభించకపోవడంతో ఉద్యోగులను బదిలీల భయం వెంటాడుతోంది.



యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు పొట్టి శ్రీరాములు కళాశాలలోకి వెళ్తున్న అభ్యర్థిని, దివ్యాంగులు

యోగా ఔన్నత్యాన్ని చాటిచెబుదాం
» కలెక్టర్ లక్ష్మీశ
6



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ముగిసిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పేపర్-1కు 5,176 (55.1 శాతం), పేపర్-2కు 5,665 (54.6 శాతం) అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూం ద్వారా పరీక్ష నిర్వహణను పర్యవేక్షించామన్నారు. అభ్యర్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఉద్యోగసంఘాల నాయకులు

యోగా ఔన్నత్యాన్ని చాటిచెబుదాం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సత్యనారాయణపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : యోగా ఔనత్యాన్ని చాటడంలో ఉద్యోగసంఘాలు కీలక పాత్రపోషించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. 'యోగాంధ్ర' ఉత్సవాలలో భాగంగా ఆదివారం జిల్లా ఆయుష్‌శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులో కలెక్టర్ లక్ష్మీశ, ఐకాసా నేతలు, ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల్లో పని ఒత్తిడిని జయించేందుకు యోగా ఉత్తమ మార్గం అన్నారు. ఉద్యోగసంఘాల నేతలు తమ పరిధిలోని ఉద్యోగులకు యోగా విశిష్టత గురించి వివరించి ప్రోత్సహించాలన్నారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ధృడత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారిణి వి.రాణి, మెడికల్ ఆఫీసర్ వై.రత్నప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనలో క్రీడా సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలి

లబ్బీపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధికారులతో పాటు క్రీడా సంఘాలనూ భాగస్వామ్యం చేయాలని ఏపీ ఒలింపిక్ సంఘం 10వ వార్షిక సర్వసభ్య సమావేశం తీర్మానించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఏపీవోఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కే.పురుషోత్తం మాట్లాడుతూ, క్రీడాసంఘాల ప్రతినిధులు లేకుండా సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తే నకిలీలను గుర్తించడం కష్టతరమవుతుందని, గతంలో క్రీడాసంఘాల భాగస్వామ్యం లేకుండా స్పోర్ట్స్ కోటాలో వందలాదిమంది నకిలీ సర్టిఫికెట్లతో సచివాలయ ఉద్యోగాలు పొందారని ఆరోపించారు. సమావేశంలో 38 క్రీడా సంఘాల రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు. జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒలింపిక్ రన్‌లను నిర్వహించాలని తీర్మానించారు.

అమరావతిలో పెట్టుబడులు పెట్టండి

» ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో సీఆర్‌డీఏ కమిషనర్ ప్రమోషన్

రామలింగేశ్వరనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతికి పెట్టుబడులు సమకూర్చుకోవటానికి సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు ఆదివారం ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఢిల్లీ, గుర్గావ్‌లో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఏరో సిటీ అవకాశాల గురించి చర్చించారు. ఈ రంగంలో ఔత్సాహికులైన వారిని పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించారు. గుర్గావ్‌లో మాదిరిగా అమరావతిలో కూడా అత్యాధునిక వాణిజ్య స్థలాల రూపకల్పనకు సంబంధించి ప్రమోషన్ నిర్వహించారు. అమరావతి మాస్టర్ ప్లాన్ గురించి వివరించటంతో పాటు ఎయిర్‌పోర్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, గ్రీన్‌స్పేస్, స్పోర్ట్స్ స్టేడియాల అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించారు.




సర్వేశ్వరరావు కుటుంబసభ్యులతో సుమంత్

నగరంలో హీరో సుమంత్ సందడి..

గాంధీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): 'అనగనగా' చిత్రం ఇటీవల ఓటీటీలో ప్లాట్‌ఫాంలో అందరి ప్రశంసలు పొందడంపై హీరో సుమంత్ హర్షం వ్యక్తం చేశారు. ప్రేక్షకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. 'అనగనగా' చిత్రాన్ని వీక్షించేందుకు నగరానికి వచ్చిన ఆయన అనంతరం ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్దార్ ఎన్.సర్వేశ్వరరావు నివాసానికి చేరుకోగా కుటుంబసభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కొద్దిసేపు వారితో ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తు లు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగ పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్క రోజులోనే రూ.8,70,250 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

నైతికతకు కవులు నడుం బిగించాలి

» ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు

విజయవాడ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నైతికతను కవులు భుజాని కెత్తుకోవాల్సిన అవసరం వుందని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్వర్యంలో ఆదివారం ఉదయం గవర్నరుపేట బాలోత్సవ భవన్‌లో బంగార్రాజు కంఠ రచించిన 'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఒక లైక్ కోసం జీవితాల్ని కోల్పోతున్న ప్రమాదకరమైన వాతావరణంలో మనం జీవిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలోనే కవులు ఉమ్మడిగా గెంతాలన్నారు. కవులకు ఏ విషయాన్నయినా కవిత్వం చేసే హక్కు వుందన్నారు. కవుల్ని ఎవరూ శాసించవద్దన్నారు. సభకు అధ్యక్షత వహించిన బిక్కి కృష్ణ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా క్రమశిక్షణ లేదన్నారు. సినీ గేయరచయిత రసరాజు మాట్లాడుతూ, కవికి సొంత డిక్షన్ కావాలన్నారు. సుప్రసిద్ధ కవయిత్రి, విమర్శకురాలు ఘంటసాల నిర్మల మాట్లాడుతూ, స్త్రీలను గౌరవించడం గొప్ప సంస్కృతి అన్నారు. సమాజంలో ప్రతిచోట స్త్రీలపై జరుగుతున్న వివక్షాపూరిత మానసిక మారణకాండను కవులు నిరసించాలన్నారు. ప్రసిద్ధ కవి, విశ్లేషకులు కావ్య విశ్లేషణ చేస్తూ - ముక్తిని డోర్ డెలివరీ చేస్తున్న నేటి కాలంలో కవులు మూలాల రక్షణ ఎరుకతో రాయడం మౌలిక అవసరమన్నారు. పీడితుల దుఃఖాన్ని కళాతత్వంగా చెప్పడం నేటి సాహిత్యంలో కొత్త అభివ్యక్తి అన్నారు. కవులు వస్తువుతో తపస్సు చేస్తే తప్ప కొత్త కవిత్వం రాదన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ, పుస్తకాలు కొనడమంటే కవులు, రచయితలను గౌరవించడమేనన్నారు. ఇంటి నిర్మాణానికి పరిమితులిచ్చే అధికారులు ఆ ఇంట్లో ఒక పుస్తకాల గది వుంచడం తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి, ప్రముఖ కవి జెల్ది విద్యాధరరావు, పోలీసు అధికారి, కవి లోసారి సుధాకర్, పుస్తక రచయిత బంగార్రాజు కంఠ, సాహితీవేత్తలు ఘంటా విజయ్‌కుమార్, సరికొండ నరసింహారాజు, వరప్రసాద్, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.

దశాబ్దాల నాటి సొంతింటి కల..

సాకారం దిశగా!



సొసైటీ కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు

» ఆశ, నిరాశల నడుమ జర్నలిస్టుల అలుపెరుగని పోరాటం

» ఎమ్మెల్యే యార్లగడ్డ, అధికారుల చొరవతో సొసైటీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

» అధికారుల సూచన మేరకు సొసైటీ కార్యాలయం ఏర్పాటు

గుణదల, మే 25 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల కోసం నున్న మ్యాంగో మార్కెట్ ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 'విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ అండ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ' నేతృత్వంలో తాత్కాలిక కార్యాలయాన్ని ఆదివారం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిగురుపాటి సతీష్‌బాబు, సొసైటీ సీఈవో ఎస్.వెంకట్రావులు ప్రారంభించారు. కార్యక్రమానికి సొసైటీ సభ్యులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్, వెంకట్రావులు మాట్లాడుతూ, సుమారు పదిహేడేళ్లుగా సొంతింటి కల సాకారానికి జర్నలిస్టులు చేస్తున్న పోరాటంలో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయన్నారు. నాడు ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణలదారుల నుంచి కాపాడుకునేందుకు నిరంతర పోరాటం చేయాల్సి వచ్చిందని, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం, అధికారుల చొరవతో ఎట్టకేలకు సొసైటీ స్థలంలోని ఆక్రమణలను తొలగించినట్టు చెప్పారు. ఈ క్రమంలో జర్నలిస్టుల స్థలంలో సొసైటీ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జర్నలిస్టులు సొసైటీగా ఏర్పడి సొంతింటి కోసం పదిహేడేళ్లకు పైగా పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. అటు అధికారులు గానీ, ఇటు పాలకులు గానీ పట్టించుకోక.. ఇంటి కల నెరవేరకుండానే సొసైటీ సభ్యుల్లో కొందరు చనిపోయారని, సొసైటీకి స్థలం మాత్రం సొంతం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి దశాబ్దాల పోరాటానికి ముగింపు పలికేలా సహకారం అందించాలని కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం మరువలేనిదని, ఆయనకు రుణపడి ఉన్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించి సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురావటం జరిగిందన్నారు. ఇదే సమయంలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి జర్నలిస్టుల పోరాటంపై స్పందించి అవసరమైతే ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చే అంశాన్ని పరిశీలించి సీఎంకు వివరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆక్రమణల చెరలో ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి స్థానిక తహసీల్దార్ సుగుణకు విషయం చెప్పి ఆక్రమణలు తొలగించాలని సూచించగా.. రెండు రోజుల్లోనే మొత్తం ఆక్రమణలను తొలగించారన్నారు. దీంతో స్థలం తిరిగి ఆక్రమణలకు గురికాకుండా అధికారుల సూచన మేరకు జర్నలిస్టుల సొసైటీ పేరున బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్థలంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు.

జెడ్పీ బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు

(5వ పేజీ తరువాయి)

ఉత్తర్వులు తయారు చేసి, ఈ నిబంధనల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు చెప్పారు. జెడ్పీ ఉద్యోగులకు కౌన్సెలింగ్ పద్ధతిలో కాకుండా, బదిలీ కోసం దరఖాస్తు చేసే సమయంలో మూడు ప్రాంతాలను ఆప్షన్‌గా పెట్టుకోవాలని, దీని ప్రకారం కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు ఉంటాయనే సంకేతాలు పంపడంతో జెడ్పీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఉద్యోగుల వినతి

జెడ్పీ పరిధిలోకి వచ్చే పంచాయతీరాజ్‌లోని వివిధ విభాగాల్లో బదిలీలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కొన్ని కీలకమైన సూచనలను జెడ్పీ అధికారులు మార్పులు చేసి, తాము అనుకున్న విధంగా జిల్లా పరిషత్ నుంచి ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేశారు. మార్పు చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. ఈ పరిణామం అనంతరం జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్‌ను ఉద్యోగులు కలిశారు. ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వ ఉత్తర్వులనే మార్చివేశారని ఆయనకు వివరించారు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను మార్పు చేసిన ఉద్యోగులను పిలిపించి ఆయన ప్రశ్నించారు. ఉద్యోగుల బదిలీల అంశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోపైనా ఒత్తిడి రావడంతో ఆయన గత రెండు, మూడు రోజులుగా మిన్నకుండిపోయారని ఉద్యోగులు అంటున్నారు. ఒత్తిడి కారణంగా తాను సెలవు పెట్టి వెళ్లిపోతానని సూచనప్రాయంగా జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చెబుతున్నారని ఉద్యోగులు చెప్పుకోవడం గమనార్హం. దీంతో జెడ్పీ ఉద్యోగులు ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మను ఇటీవల కలసి విషయం తెలియజేశారు. కలెక్టర్ వచ్చిన తర్వాత ఈ అంశాన్ని పరిశీలిస్తారని ఆమె చెప్పారు. దీంతో కొందరు ఉద్యోగులు ఆదివారం జెడ్పీ ఛైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి మరీ కలసి, ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా బదిలీలు చేయాలని కోరారు. బదిలీలు జరుగుతాయని, కానీ కొద్దిపాటి మార్పులతో జరుగుతాయని ఆమె చెప్పారని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. జెడ్పీలో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు 40 మంది, రెండేళ్ల అంతకు మించి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు 300 మంది వరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. వీరిని ఎక్కడెక్కడకు బదిలీ చేస్తారనే అంశంపై జెడ్పీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ పాలనలో జెడ్పీ ఉద్యోగులపై ఒత్తిడి కత్తి పెట్టడంతోపాటు తమకు అనుకూలంగా లేరనే కారణం చూపి వివిధ విభాగాల్లో అత్యంత కీలక విధులను నిర్వహించేవారిని గతంలో దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. మరి కొందరు ఉద్యోగులు వేధింపులు తాళలేక బదిలీ చేయించుకుని ప్రాధాన్యతలేని పోస్టుల్లోకి వెళ్లారు. దీంతో జెడ్పీలో కీలక విభాగాల్లో పనులను చక్కబెట్టేవారు లేకుండా పోయారని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం జరిగే బదిలీల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది.

సెలవులో జెడ్పీ సీఈవో!

జెడ్పీ సీఈవో కన్నమనాయుడు కొన్నిరోజులుగా సెలవులో ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవు పెట్టారని పైకి చెబుతున్నా, తెరవెనుక అనేక అంశాలు ముడిపడి ఉన్నాయని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాన్ని జెడ్పీ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్‌తోపాటు జెడ్పీటీసీ సభ్యులు ఇటీవల పట్టుబట్టారు. జెడ్పీ జనరల్ ఫండ్స్ నుంచి జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఆడిట్ అభ్యంతరాలు వస్తాయని సీఈవో ఆ ఫైల్‌ను పక్కన పెట్టేశారు. దీంతో సీఈవోపై జెడ్పీ పాలక వర్గ సభ్యులు గుర్రుగా ఉన్నారు. ఈ కారణం చూపి ఇటీవల జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. ఈ నెల 26వ తేదీతో జెడ్పీ సీఈవో సెలవు ముగుస్తుంది. జెడ్పీ ఉద్యోగుల బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో జూన్ 1, 2 తేదీల్లో జరపాల్సి ఉంది. సీఈవో కన్నమనాయుడు వస్తే ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉద్యోగుల బదిలీలను చేస్తారని, అయితే ఆయనపై ఒత్తిడి తెచ్చి సెలవు పొడిగించేలా తెరవెనుక వ్యవహారం నడుస్తోందని జెడ్పీ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. రానున్న రోజుల్లో జెడ్పీ విభాగంలో ఉద్యోగుల బదిలీల అంశం ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచిచూడాలి.

పోలవరం గట్టు గుట్టు.. గప్‌చుప్!

(5వ పేజీ తరువాయి)

కరిగించేశారు. ఈ సబ్‌డివిజన్ పరిధిలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఇచ్చిన సమాధానం మేరకు చూస్తే.. 2015 నుంచి 2019 వరకు పోలవరం కాల్వ తవ్వకాలకు సంబంధించి మొత్తంగా 58,45,266 క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. ఈ మట్టిని కాల్వకు రెండు వైపులా గుట్టలుగా పోశారు. ఇందులో 3,33,999 క్యూబిక్ మీటర్ల మేర ప్రభుత్వ శాఖల అవసరాల కోసం కేటాయించారు. దీని ప్రకారం చూస్తే మరో 55 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉండాలి. ఎంత మట్టి ఉందో తెలియదని సమాధానం ఇచ్చారు. మిగిలిన మట్టికి సంబంధించి లెక్కలు ఎందుకు చెప్పలేకపోతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. గన్నవరంలో కొద్దిచోట్ల తప్ప దాదాపు పోలవరం మట్టి తరలింపునకు గురైంది. ఎంత మట్టి ఉందో కనీసం ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి లెక్కలు తీయకపోవటం గమనార్హం.

జక్కంపూడి కొండ గ్రావెల్, మట్టి ఏమైందో తెలియదు

పోలవరం కుడి కాల్వ నిర్మాణం కోసం జక్కంపూడి దగ్గర కొండను తవ్వాల్సి వచ్చింది. 2015 - 2019 వరకు రికార్డుల్లో ఉన్న సమాచారం మేరకు 28,73,922 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇందులో 5,46,860 క్యూబిక్ మీటర్ల మేర ప్రభుత్వ అవసరాలకోసం కేటాయించారు. పోనీ అధికారుల లెక్కచేసూస్తే మరో23లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైందో తెలియదు? క్షేత్రస్థాయిలో తట్టెడు గ్రావెల్ కూడా లేదు. ఎంత గ్రావెల్ ఉందో కూడా అధికారులు చెప్పట్లేదు.

మిగిలింది ఎంత?

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలో పోలవరం కుడికాల్వకు సంబంధించి 2005-15, 2015-19 వరకు కాల్వ నిర్మాణ పనులు జరిగాయి. గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో 2005 నుంచి 2014 వరకు ఎలాంటి కాల్వ తవ్వకాలు జరగలేదు. 2015 నుంచి 2019 వరకు 58,45,266 క్యూబిక్ మీటర్లు తవ్వి కాలువ ఒడ్డున నిల్వ చేశారు. ప్రభుత్వ అవసరాల కోసం 3,33,299 క్యూబిక్ మీటర్ల మట్టిని కేటాయించారు. ఇంకా 55,11,967 క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉండాలి? ఎంత ఉందో లెక్క తెలియదట.

● నున్న సబ్ డివిజన్ పరిధిలో 2014 వరకు 53,67,162 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నిల్వ చేశారు. ఇందులో 12,71,685 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. పోగా 40,95,477 క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైందో తెలియదట.

● విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో 2014 వరకు 36,04,508 క్యూబిక్ మీటర్లు, 2019 నాటికి మరో 28,73,922 క్యూబిక్ మీటర్లు తవ్వి నిల్వ చేశారు. మొత్తంగా 64,78,430 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగా, 10,58,114 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. పోగా 54,20,316 క్యూబిక్ మీటర్లకు లెక్క లేదు.

● వెలగలేరు సబ్‌డివిజన్ పరిధిలోని ఏఈ సెక్షన్ 1,2,3 పరిధిలో 25,84,821 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నిల్వచేయగా, అందులో 2,25,197 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ అవసరాలకు కేటాయించారు. మిగిలిన 23,59,624 క్యూబిక్ మీటర్ల మట్టికి లెక్కలేదు.

క్షీర విప్లవ పితామహుడి సతీమణి అస్తమయం



స్వర్ణకుమారి

రామలింగేశ్వరనగర్ : క్షీర విప్లవ పితామహుడు, విజయా డెయిరీ వ్యవస్థాపకుడు, ఆంధ్రా కురియన్‌గా పేరొందిన వి.జస్వంతరావుకు సతీవియోగం కలిగింది. జస్వంతరావు సతీమణి స్వర్ణకుమారి (85) శనివారం సికింద్రాబాద్‌లోని మౌలాలిలో ఉన్న స్వగృహంలో కన్నుమూశారు. జస్వంతరావు, స్వర్ణకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. స్వర్ణకుమారి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజజీయర్ స్వామి శిష్యురాలిగా ఉన్నారు. ఆధ్యాత్మిక తేజోమణిగా పేరొందారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, వెంకటేశ్వరరావు (ఫైల్)

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

నందిగామ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అనాసాగరం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చెందిన చింటూరి వెంకటేశ్వరరావు (66) భార్య నాగమణి, కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి తెలంగాణలోని సరస్వతీ నది పుష్కరాలకు కాళేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా అనాసాగరం వద్ద ఫ్లైఓవర్‌పై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వెంకటేశ్వరరావు, నాగమణి, పెద్ద కుమార్తె శ్యామల, బంధువులు రవి, భార్య లక్ష్మీలతో పాటు విజయవాడకు చెందిన కారు డ్రైవర్ కొమరంపల్లి కార్తిక్‌లను హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో వెంకటేశ్వరరావు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాయుడు తెలిపారు.

వారు రోహింగ్యాలే..

బైండోవర్, హైదరాబాద్ తరలింపు

పెనమలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలో గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులను రోహింగ్యాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వారి వివరాలను పోలీసులు ఆదివారం తెలిపారు. వారు హైదరాబాద్ శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని, వీరిలో ముగ్గురు హైదరాబాద్‌కు శరణార్థి శిబిరానికి చెందినవారు కాగా, మిగిలిన 12 మంది మయన్మార్ నుంచి అక్రమంగా మనదేశంలోకి ప్రవేశించిన వారుగా గుర్తించామన్నారు. రోహింగ్యాలు హైదరాబాద్ బాలానగర్‌లోని శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి తాడిగడప, వందడుగుల రోడ్డు, గంగూరు ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నట్లు గుర్తించామని, వీరి నుంచి తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక కారు, 16 సెల్‌ఫోన్లు, బంగారం, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వారిని పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణ బైండోవర్ చేసి హైదరాబాద్‌లోని శరణార్థి శిబిరానికి తరలించామన్నారు.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

(5వ పేజీ తరువాయి)

కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

చాన్నాళ్ల తర్వాత

వేసవి కాలంలో ప్రతి ఏడాది మే నెలలో రోహిణి కార్తె ప్రారంభమవుతుంది. ఇది 15 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ 15 రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాల్పులు విపరీతంగా వీస్తాయి. రాత్రి ఏడెనిమిది గంటల వరకు వేడి గాలులు వీస్తాయి. ఈ రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఇది జూన్ ఎనిమిదో తేదీ వరకు ఉంటుంది. రోహిణి రోజుల్లో జిల్లా మొత్తం నిప్పుల కొలిమిలా మారుతుంది. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత కనిపించింది. ఈ పరిస్థితి మధ్యాహ్నం రెండు, మూడు గంటల వరకు మాత్రమే ఉంది. ఆ తర్వాత నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశం మేఘావృతమై చల్లనిగాలులు వీచాయి. ఒక్కసారిగా వర్షం కురవడం మొదలైంది. సాధారణంగా ప్రతి ఏడాది రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతాయి. వాతావరణ శాఖ రికార్డులు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ఈ ఏడాది మాత్రం రోహిణి ప్రభావం ఉమ్మడి కృష్ణా జిల్లాపై పడలేదు. రోహిణి అడుగుపెట్టిన తర్వాత వరుణుడు ఆ వేడిని చల్లార్చడంతో ప్రజలకు ఒక్కసారిగా ఉపశమనం లభించినట్టయింది. ఇలాంటి పరిస్థితి ఇంతకుముందు చాన్నాళ్ల క్రితం చూశామని ప్రజలు చెబుతున్నారు. బంగాళాఖాతం, అరేబియన్ సముద్ర గర్భంలో అల్పపీడనం ఏర్పడడంతో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ వర్షాలు నెలాఖరు వరకు నిరంతరం కురుస్తాయని అంచనా వేశారు. దీనితోడు మరో మూడు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోకి అడుగుపెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, రుతుపవనాల రాకతో ఉమ్మడి కృష్ణా జిల్లాకు రోహిణి సెగ తప్పినట్టవుతుంది.

ఈ చేపలు తింటే అంతే!

(5వ పేజీ తరువాయి)

పరిసరాల్లో చేపల చెరువులు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. నాగార్జున సాగర్ కాలువకు వదిలిన నీటిని పెద్ద ఎత్తున ఈ చేపల చెరువులకు మళ్లించుకుంటున్నారు. జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో తారకరామా ఎత్తిపోతల పథకం నీరు, వీటీపీఎస్ నీటిని, కాలువ ద్వారా వచ్చే నీటిని వాడుకుంటున్నారు.

పక్క పొలాలకు చేటు

చేపల చెరువుల వల్ల పక్క పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు పండించే అవకాశం లేకుండా పోతుందని వాపోతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు తిని పెరిగిన చేపలు తినే వారికి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. కోళ్లకు ఎక్కించే యాంటిబయాటిక్స్, హార్మోన్లు, భారీ లోహాలు (లీడ్, ఆర్సెనిక్) వంటివి చేపల ద్వారా మనుషుల శరీరంలోకి చేరి అనేక వ్యాధులకు కారణమవుతాయని పేర్కొంటున్నారు.

శభాష్ ఆటోడ్రైవర్

» తన వివరాలు తెలిసేలా ఖాకీ చొక్కాకు బ్యాడ్జీ

» మెచ్చుకున్న ట్రాఫిక్ పోలీసులు, సత్కారం

విజయవాడ/సత్యనారాయణపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : 'కృష్ణమనోహర్ ఐపీఎస్. బ్యాచ్ నెంబరు 57. బ్యాడ్జి నెంబరు 32567.' ఓ చిత్రంలో హీరో గురించి ఆయన తండ్రి.. ప్రతినాయకుడికి గొప్పగా చెప్పే సందర్భంలోని డైలాగ్ ఇది. ఇప్పుడు ఇదే విజయవాడలో ఓ ఆటోడ్రైవర్‌కు స్ఫూర్తినిచ్చింది. ఆ ఆటోడ్రైవర్ పేరు రవీంద్రరావు. డ్రైవింగ్ లైసెన్స్ నెంబరు 96/2058. బ్యాడ్జి నెంబరు 80899.. కానీ అందరి ఆటోడ్రైవర్ల మాదిరిగా ఆయన ఆ వివరాలను దాచుకోలేదు. చొక్కా జేబుకు తగిలించుకునే ఓ బ్యాడ్జీ మాదిరిగా ఆ వివరాలను తయారు చేసుకున్నాడు. తన వివరాలను అందరికీ తెలిసేలా ఖాకీ చొక్కాపై తగిలించుకున్నాడు. నగరంలో నిత్యం వేలాది ఆటోలు తిరుగుతున్నా డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం లేదు. ఖాకీ చొక్కా ధరించాలన్న కనీస నిబంధన కూడా మరిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో రవీంద్రరావు తన వివరాలు తెలిసేలా నిబంధనలు పాటించడాన్ని ట్రాఫిక్ పోలీసులు మెచ్చుకున్నారు. ట్రాఫిక్-3 ఇన్‌స్పెక్టర్ కిషోర్, ఎస్‌ఐలు తమ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఆయన్ను సత్కరించారు.



ఆటోడ్రైవర్‌ను అభినందిస్తున్న పోలీసులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, మే 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.


కనకదుర్గానగర్ కాలనీ అంతర్గత రోడ్డులో..


కరెన్సీనగర్ కాలనీ మురుగుకాలువ సమీపంలో..


గణేష్‌నగర్ కాలనీ అంతర్గత రోడ్డులో..


గణేష్‌నగర్‌కాలనీ 8ఏ రోడ్డులో వర్షపు నీటిలో పడుకున్న గేదెలు


నాగార్జునగర్ కాలనీ ఆరో రోడ్డులో..

దోమలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

యజమానులు పట్టించుకోకపోవడంతో దట్టంగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు

- పల్లంగా ఉండడంతో రోజుల తరబడి బయటకు వెళ్లని వర్షపునీరు
- ఇబ్బంది పడుతున్న మూడో డివిజన్ పరిధిలోని కాలనీల ప్రజలు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్)

మూడో డివిజన్ పరిధిలోని కాలనీల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసంగా మారాయి. చాలా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. నాగార్జునగర్ కాలనీ, కరెన్సీనగర్ కాలనీ, శ్రీ రామచంద్రనగర్ కాలనీ, గణేష్‌నగర్, కనకదుర్గానగర్ కాలనీల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లలో నివాసాల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొంతకాలంగా స్థల యజమానులు పట్టించుకోకపోవడంతో చెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. కాలనీల్లోని రోడ్ల కంటే స్థలాలు తక్కువ ఎత్తులో ఉండడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు, మురుగు చేరి, స్థలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి. పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయని, అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానిక పెద్దలు కోరుతున్నారు.


కరెన్సీనగర్ కాలనీ కృష్ణ ఎన్‌క్లేవ్ సమీపంలోని ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు


పగుళ్లిచ్చిన, సైడ్లకు పెచ్చులు ఊడిన యనమలకుదురు చిన్న వంతెన

శిథిలావస్థలో చిన్న వంతెన

- మరమ్మతులు చేయించాలని కోరుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-పటమట): ఎన్టీఆర్ సర్కిల్, పటమట ప్రాంత ప్రజలు యనమలకుదురు వెళ్లేందుకు ఉపయోగపడుతున్న చిన్నవంతెన శిథిలావస్థకు చేరింది. 14వ డివిజన్ నుంచి యనమలకుదురు ఊళ్లోకి ఉండే ఈ వంతెనను చాన్నాళ్ల క్రితం నిర్మించారు. వంతెన కింద సిమెంట్ పెచ్చులూడిపోయింది. మహాశివరాత్రి, మాస శివరాత్రి, పౌర్ణమి రోజుల్లో శివాలయానికి వేలాది మంది భక్తులు ఈ వంతెన మీదుగానే వెళతుంటారు. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, భక్తులు భయపడుతున్నారు. వంతెన వద్ద ఘాట్ కూడా అపరిశుభ్రంగా ఉందని అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


వైసీపీ పెనమలూరు నియోజకవర్గ నాయకులకు జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

వైసీపీ నుంచి జనసేనలోకి..

భారతీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గం కంకిపాడుకు చెందిన వైసీపీ నాయకులు 150 మంది ఆదివారం కరెన్సీనగర్ కాలనీలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. బండ్రెడ్డి రామకృష్ణ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చూడాలని వారికి ఆయన సూచించారు. పార్టీలో చేరిన వారిలో చింతకింద సాయి సునీల్, కోటేలు వెకటేశ్వరరావు, తంబాబత్తుల చిన కనకయ్య, గుడివాడ హరికృష్ణ, అంబుల రాంబాబు, కూనపరెడ్డి రామకృష్ణ స్నేహితులు, కంకిపాడు ఆటో యూనియన్ అధ్యక్షుడు కోల గోపి, పలువురు ఆటో యూనియన్ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పులి కామేశ్వరావు, బూరగడ్డ శ్రీకాంత్, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశంపై కేంద్రం నిర్లక్ష్యం

- దేశ రెండో రాజధాని, సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి
- జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కరణం రాజేష్‌కుమార్ డిమాండ్

గాంధీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కరణం రాజేష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో దేశ రెండో రాజధాని, సుప్రీం కోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత జనాభా గణనీయంగా తగ్గిపోయిందని దేశ జనాభాలో 17 శాతంగా ఉందని ఆయన తెలిపారు. దక్షిణ భారతానికి 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. 1970లో డాక్టర్ కేఎల్ రావు ప్రతిపాదించిన నదుల అనుసంధాన ప్రాజెక్టుల్లో ఇప్పటి వరకు ఎటువంటి ప్రగతి లేదన్నారు. గంగా, యమునా నదుల మిగులు జలాలను దక్షిణ భారత దేశంలోని నదులకు అనుసంధానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి దక్షిణ భారత ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జీఎస్ ఫణిరాజ్‌ను ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, జైహింద్ పార్టీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, నవతరం పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కస్తూర్బా' ఉపాధ్యాయుల
శిక్షణ వాయిదా వేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్

బెంజిసర్కిల్, మే 25(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు మారిస్ స్టెల్లా కళాశాలలో నిర్వహించే శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే వారిలో ఎక్కువ మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నారని, వీరు డీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నారని, దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టిసారించాలని కోరారు. లేనిపక్షంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల పక్షాన నిలిచి సోమవారం నుంచి జరిగే శిక్షణ తరగతులను అడ్డుకుంటామని సాయికుమార్ పేర్కొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

సత్యనారాయణపురం, మే 25(ఆంధ్రజ్యోతి): చెడు వ్యాసనాలకు బానిసలుగా మారి బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరిని సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన వాహనాలను అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు ఆదివారం పెజ్జోనిపేటకు చెందిన సయ్యద్ సాజిద్, అదే ప్రాంతానికి చెందిన ఖాన్ చంద్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమ్మవారికి కళార్చన చేస్తున్న నృత్యకారిణులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వసతులపై ఈవో శీనానాయక్ ఆరా ● అమ్మవారికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చేలా ఈవో శీనానాయక్ అధికారులకు పలు సూచనలు చేశారు. రూ.500, రూ.300 టికెట్ల క్యూలైన్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరి వద్ద టికెట్టు ఉండేలా చూడాలని, లేని పక్షంలో అక్కడ విధుల్లో ఉండేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈవో చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

అధిక రుసుం వసూలుపై ఫిర్యాదులు..

ఆలయప్రాంగణంలో తనిఖీలు నిర్వహించిన ఈవోకు పలువురు భక్తులు దుకాణాలు కౌంటర్ల వద్ద అధిక రుసుం వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో, పూజాసామగ్రి దుకాణాలవద్ద, క్లోక్‌రూమ్‌లో సిబ్బంది నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తున్నారని భక్తులు వివరించారు. సంబంధిత విభాగాల అధికారులను పరిశీలించాలని ఈవో ఆదేశించారు.

విశేష పూజలు

దుర్గామల్లేశ్వరులకు విశేషపూజలు జరిగాయి. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు సూర్యోపాసనసేవ నిర్వహించారు. సూర్యనారాయణమూర్తికి షోడశోపచార పూజలు నిర్వహించారు.


భక్తులతో మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

భక్తుల అభిప్రాయాల సేకరణ

ఇంద్రకీలాద్రిపై భక్తులకు కల్పించే వసతులు, అందించే సేవల్లో మెరుగైన విధానాన్ని తేవడానికి ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవీఆర్ఎస్) ద్వారా భక్తుల మనోభీష్టాలను, ఆలయ అభివృద్ధికి సూచనలు, సలహాలను సేకరించేందుకు కొండపైన శారీస్ కౌంటర్ పక్కన ప్రత్యేకంగా ఫీడ్ బ్యాక్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. భక్తులను వివరాలు అడిగి వారి ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. అభిప్రాయాలను తెలుసుకుని వాటిని నమోదు చేస్తున్నారు. రోజుకు 500 మంది భక్తుల నుంచి ఫోన్ నెంబర్లు, వారి పేర్లు, అభిప్రాయాలను ఫీడ్ బ్యాక్ కౌంటర్ ద్వారా సేకరిస్తున్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం...

మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళానిలయం విద్యార్థులు నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్య కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను వారికి అధికారులు అందజేశారు.

అన్నవితరణకు రూ.2 లక్షల విరాళం

కేదారేశ్వరపేటకు చెందిన వి.వెంకట అప్పారావు, కుటుంబ సభ్యులతో ఆదివారం దుర్గగుడిలో అన్నవితరణ నిమిత్తం రూ.2,00,003 ఈవో శీనానాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి సారూ!

ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్న అంబేద్కర్‌నగర్ కాలవగట్టు ప్రాంతవాసులు

(ఆంధ్రజ్యోతి-రామలింగేశ్వరనగర్): పటమట అంబేద్కర్ నగర్ కాలనీ కాలవగట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న పేద, బలహీన వర్గాల వారు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు. ఇరుకు ఇళ్లు, దుస్తులు ఉతుక్కోవడానికి కనీసం స్థలం లేకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంతా దుస్తులు ఉతుక్కోవడానికి కాలువను ఆనుకుని ఉన్న రేవే ఆధారం. ప్రస్తుతం కాలువలో నీరు లేక, కొన్నేళ్లుగా మెట్లు, రేవు బల్ల పగిలిపోయాయి. దీంతో స్థానికులు అక్కడ దుస్తులు ఉతకడం లేదు. రేవు అస్తవ్యస్తంగా ఉండి నిరుపయోగంగా ఉంటోంది. దానికి మరమ్మతులు చేయించి రేవును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. కాలనీ రోడ్లపైనే వర్షపు నీరు నిల్వ ఉంటోందని, రానున్నది వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. ఈ సమస్యలను డివిజన్ ప్రజా ప్రతినిధికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన వర్షపునీరు, దుస్తులు ఉతుక్కునే చోట పగిలిన మెట్లు, రేవు బల్ల



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510	



నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో వుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.


భక్తులతో మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమ్మవారికి నృత్యకళార్చన

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

● వసతులపై ఈవో శీనానాయక్ ఆరా ● అమ్మవారికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ ఈవో శీనానాయక్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈవో రూ.500, 300లు టికెట్ల క్యూలైన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరి వద్ద టికెట్టు ఉండేలా చర్యలు తీసుకోవాలని లేని ఎడల అక్కడ విధుల్లో ఉండేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈవో చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

అధిక రుసుం వసూలుపై ఫిర్యాదులు..

ఆలయప్రాంగణంలో తనిఖీలు నిర్వహించిన ఈవోకు పలువురు భక్తులు దుకాణాలు కౌంటర్ల వద్ద అధిక రుసుం వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో, పూజాసామగ్రి దుకాణాలవద్ద, క్లోక్‌రూమ్‌లో సిబ్బంది నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. స్పందించిన ఈవో సంబంధిత విభాగాల అధికారులను పరిశీలించాల్సిందిగా ఆదేశించారు.

విశేష పూజలు

దుర్గామల్లేశ్వరులకు విశేష పూజలు జరిగాయి. లక్షకుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు సూర్యోపాసనసేవ నిర్వహించారు. సూర్యనారా యణ మూర్తికి శోడశోపచార పూజలు నిర్వహిం చారు.

అలరించిన కూచిపూడి నృత్యం...

మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళానిలయం విద్యార్థులు నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్య కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు కీర్తనలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

అన్నవితరణకు రూ.2 లక్షల విరాళం

కేదారేశ్వరపేటకు చెందిన వి.వెంకట అప్పారావు, కుటుంబ సభ్యులతో ఆదివారం దుర్గగుడిలో అన్నవితరణ నిమిత్తం రూ.2,00,003 ఈవో శీనానాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.


సూర్యోపాసన సేవలో వేద పండితులు


అన్నవితరణకు రూ.2లక్షలు అందజేస్తున్న దాతలు

భక్తుల అభిప్రాయాల సేకరణ

ఇంద్రకీలాద్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై భక్తులకు కల్పించే వసతులు, అందించే సేవల్లో మెరుగైన విధానాన్ని తీసుకురావటం ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) ద్వారా భక్తుల మనోభీష్టాలను, ఆలయ అభివృద్ధికి సూచనలు, సలహాలు సేకరించేందుకు కొండపైన శారీస్ కౌంటర్ పక్కన ప్రత్యేకంగా ఫీడ్‌బ్యాక్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. భక్తులను వివరాలు అడిగి వారి ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. అభిప్రాయాలను తెలుసుకుని వాటిని నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 మంది భక్తుల నుంచి ఫోన్ నెంబర్లు, వారి పేర్లు, అభిప్రాయాలు సేకరిస్తున్నారు.




విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

58వ డివిజన్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పాయకాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : నందమూరి తారక రామారావు విగ్రహ పునఃప్రారంభ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 58వ డివిజన్ సింగ్‌నగర్, కృష్ణా హోటల్ సెంటర్ వద్ద మాజీ కార్పొరేటర్ పిరియ జగదాంబ, పిరియ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. బొండా ఉమా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ అడుగుజాల్లో పయనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. అనంతరం డివిజన్‌లోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. నాయకులు నవనీతం సాంబశివరావు, కూర్మాపు దుర్గారావు, మల్లంపాటి రవికుమార్, అమర్నాథ్ గౌడ్, ఎస్‌కె. సుల్తానా పాల్గొన్నారు.

పశ్చిమలో యూపీఎస్‌పీ పరీక్షకు
627 మంది అభ్యర్థుల హాజరు

విద్యాధరపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలోని ఆదివారం పలు కేంద్రాల్లో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. భవానీపురంలోని శ్రీచైతన్య కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో 384 మందికి 223 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వన్‌టౌన్ గాంధీజీ మహిళా కళాశాలలో 192 మందికి 104 మంది, కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల -1 సెంటర్‌లో మొత్తం 576 మందికి, 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. తహసీల్దార్ షేక్ ఇంతియాజ్‌పాషా, వీరులపాడు తహసీల్దార్ ఎస్.కె.హుస్సేన్ పర్యవేక్షించారు.


భవానీపురంలోని కేంద్రంలో ప్రశ్న పత్రాలను పరిశీలిస్తున్న పశ్చిమ తహసీల్దార్ ఇంతియాజ్ పాషా

ఎమ్మెల్యే సుజనా చౌదరి కోలుకోవాలని హోమం

విద్యాధరపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి త్వరగా కోలుకోవాలని గాయత్రి ప్రజ్ఞా పరివార్, బాయన కనకదుర్గాంబ ఆధ్యాత్మిక మందిరం ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురం ఎన్డీయే కార్యాలయంలో మృత్యుంజయ, గాయత్రి హోమాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, కూటమి నాయకులు ఎ.బుల్లబ్బాయ్, బి.శ్రీనివాస్, ఉమాకాంత్, డి.రాజా, ఎస్.శ్రీనివాస్, పి.మల్లిఖార్జున్, ఎస్.రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆరో రోజుకు లైబ్రరీ వర్క్‌షాపు

విజయవాడ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'లైబ్రరీ వర్క్‌షాపు' ఆదివారం ఆరో రోజుకు చేరింది. భాషా పరిజ్ఞానాన్ని, పఠన నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకొన్నాయి. ముఖ్య అతిథులు జె.నరసింహమూర్తి, ఎ.భాస్కరరావు, డీసీపీ (ట్రాఫిక్‌జోన్) ఎం.కృష్ణమూర్తి నాయుడు, కె.రవి విద్యార్థులతో తమ అనుభవాలు పంచుకొన్నారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, గ్రంథాలయ పునర్వికాస వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి గోళ్ల నారాయణరావు, స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు హసీనా, నిహారికా పాల్గొన్నారు.

రాబోయే రోజులు రోబోలవే

సత్యనారాయణపురం: చిత్తరంజన్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం రోబో శిక్షణ తరగతులు నిర్వహించారు. మినీ రోబోస్‌ను ఏలా తయారు చేయాలో వివరించారు. అనంతరం శిక్షకుడు బాషా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రోబోల వల్ల ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, విశ్రాంత రైల్వే ఉద్యోగి కె.శేషబాల, విశ్రాంత బ్యాంక్‌మేనేజర్ టి.సాయి సుబ్బన్న, ఆర్. శ్రీనివాసులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీసీపీ కృష్ణమూర్తి నాయుడు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిట్టినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : చిట్టినగర్, టేనర్‌పేటలోని టేనర్ మెమోరియల్ హైస్కూల్ 198-84 సంవత్సరం టెన్త్ క్లాస్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం కలరా హస్పిటల్ సమీపంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. నాడు స్కూల్లో చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థులు కలుసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని కుటుంబ సభ్యుల వివరాలను పంచుకున్నారు. తరచూ గెట్ టు గెదర్ కార్యక్రమాలు చేసుకుని తమ స్నేహాన్ని కలకాలం కొనసాగించాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో మిత్రబృందం శంకర్, చిన్నికృష్ణ, సురేష్ బాబు, విజయ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కౌన్సెలింగ్

సత్యనారాయణపురం, మే 25(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉన్నవారిపై రౌడీషీట్లను తొలిగిస్తామన్నారు. ఎసైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో బాలుడు మృతి

చిట్టినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యానికి బాలుడు మృతవాత పడ్డాడని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆరోపించారు. గొల్లపాలెం గట్టు, జెండాచెట్టు ప్రాంతంలో ఆదివారం విద్యుదాఘాతంతో తమ్మ మానస్(8) మృతిచెందాడు. పాతప్రభుత్వాస్పత్రిలో బాలుడు మృతదేహాన్ని సత్యబాబు సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజన్‌లో ఇళ్లపై విద్యుత్ వైర్లు ఉన్న విషయాన్ని ఈనెల 16న విద్యుత్ అదాలత్‌లో వినతిపత్రం ఇచ్చిన స్పందించలేదన్నారు.

దొరికిన డబ్బు... పోలీసులకు అందజేత

చిట్టినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేటలోని ఓ ఏటీఎంలో ఓ వ్యక్తికి డబ్బులు దొరకడంతో అతను కొత్తపేట పోలీసులకు ఆదివారం అందజేశాడు. నగరానికి చెందిన గూడెల ఆదిత్యకు కొత్తపేట, బీఆర్‌పీ రోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలలో డబ్బులు దొరికాయి. దీంతో ఆదిత్య కొత్తపేట పోలీసులకు తనకు దొరికిన నగదును అందజేశాడు. పోగుట్టుకున్నవారు ఎవరైనా వారు ఎంత డబ్బు పోగొట్టుకున్నారో, వాటికి సంబంధించిన వివరాలు తెలియజేసి తీసుకోగలరని కొత్తపేట పోలీసులు తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం నిర్లక్ష్యం

గాంధీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కరణం రాజేష్‌కుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ సౌత్ ఇండియాకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. 1970లో డాక్టర్ కేఎల్ రావు ప్రతిపాదించిన నదుల అనుసంధాన ప్రాజెక్టుల్లో నేటి వరకు ఎటువంటి ప్రగతి లేదన్నారు. దేశ రెండో రాజధాని, సుప్రీంకోర్టు బెంచ్‌ను దక్షిణ భారతేశంలో ఏర్పాటు చేయాలని కోరారు. జీఎస్ ఫణిరాజ్‌ను రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, జైహింద్ పార్టీ అధ్యక్షుడు దశరథ రామిరెడ్డి, నవతరం పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బైక్ చోరీ నిందితులు

సత్యనారాయణపురం, మే 25(ఆంధ్రజ్యోతి) : చెడు వ్యాసనాలకు బానిసలుగా మారి బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరిని సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకోని వద్ద నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణపురం పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు అధికం కావడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. చోరీ చేసిన వాహనాలను అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు ఆదివారం పెజ్జోనిపేటకు చెందిన సయ్యద్ సాజిద్, అదే ప్రాంతానికి చెందిన ఖాన్ చంద్‌ను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



పెజ్జోనిపేటలో చోరీ

పాయకాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కండ్రిక ప్రాంతానికి చెందిన పెజ్జోనిపేటకు చెందిన ఎ.నాగేశ్వరరావు జిరాక్స్ షాపు నడుపుతున్నాడు. ఈ నెల 23న కుటుంబ సభ్యులతో తిరువూరులోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి ఆదివారం వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. బీరువా తెరిచిఉండటం, చిందబందరగా సామగ్రి పడిఉండటాన్ని గమనించి చోరీ జరిగినట్టు నిర్ధారించుకున్నారు. నగదు 60వేలు, బంగారు ఆభరణాలు అపహరించినట్టు నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార విక్రయాలపై చర్యలు

రైల్వే స్టేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సౌత్ మెయిన్ పార్శిల్ ఆఫీసు సర్క్యులేటింగ్ ఏరియాలో ఆదివారం స్టేషన్ డైరెక్టర్, అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనధికార విక్రేతలు రైల్వే ప్రాంగణంలో పుష్ ట్రాలీని ఉపయోగించి తాత్కాలిక ఆహార దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఏడుగురు అనధికార విక్రేతలపై చర్యలకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు అప్పగించారు. డ్రింకింగ్ ఐటమ్స్, అల్పాహారం, పాన్ పరాగ్, గుట్కాలు అమ్ముతున్నారు. అనధికార విక్రయాలపై దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశించారు.

ఉపాధ్యాయుల శిక్షణ వాయిదా వేయాలి : ఏఐఎస్ఎఫ్

బెంజిసర్కిల్, మే 25(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు మారీస్ స్టెల్లా కళాశాలలో నిర్వహించే శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే వారిలో ఎక్కువ మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నారని, వీరు డీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నారని, దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టిసారించాలని కోరారు. లేనిపక్షంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల పక్షాన నిలిచి సోమవారం నుంచి జరిగే శిక్షణ తరగతులను అడ్డుకుంటామని సాయికుమార్ పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.510

నేడు మహానాడుకు ప్రయాణం

గొల్లపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు కడపలో జరిగే మహానాడుకు పార్టీ శ్రేణులు తరలి వెళుతున్నారు. గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఉదయం 10గంటలకు పార్టీ శ్రేణులు కడపకు బయలుదేరతారు. ఈ సందర్భంగా టీడీపీ మైలవరం నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ కుటుంబ సభ్యులందరూ సోమవారం ఉదయం నిర్దీత సమయానికి గొల్లపూడిలోని టీడీపీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

మోదీ మన్‌కీ బాత్

నందిగామ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగచర్ల గ్రామంలోని గంటా కృష్ణ నివాసం వద్ద ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కి బాత్ ప్రజలకు వినిపించారు. బీజేపీ రాష్ట్ర సహ సంఘటన మంత్రి మధుకర్ పాల్గొన్నారు. అనంతరం అహల్యా భాయ్ హోల్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడారు. సీతారామయ్య, శ్రీనివాసరావు, పలువురు నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తిరువూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో బాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులతో గ్రీటింగ్ కార్డుల తయారు చేయ్యడం. గ్రంథాలయం వల్ల ఉపయోగాలు అంశంపై వక్తృత్వపు పోటీ, మ్యూజికల్‌చైర్ గేమ్ ఆడించారు, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. గ్రంథాలయం అధికారిణి కె.పద్మావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించగా, పలువురు విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఆలయ భూముల కౌలు వేలం

జి.కొండూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కవులూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సంతాన వేణుగోపాల, ఆంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన 7.5 ఎకరాల భూమికి ఈనెల 27న ఆత్కూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 10.75 ఎకరాల భూమికి, విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని శ్రీ పాడురంగ విఠలేశ్వర, భవానీశంకర స్వామి దేవస్థానం భూమి 39.26 ఎకరాలకు ఈనెల 28న ఆయా దేవస్థానాల ఆవరణలో మూడేళ్ల కౌలు నిమిత్తం వేలంపాట నిర్వహించనున్నట్టు ఈవో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడి ఎన్నిక

తిరువూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడి ఎన్నికల ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో యూనియల్ అధ్యక్షుడిగా వేముల రమేశ్ (ఏసు)ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ మాబు సాహేబ్, కన్వీనర్ మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ షేక్ అబ్దుల్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘ నేతలు కామాల రామారావు, షేక్ రసూల్, కొంగల వెంకటేశ్వరరావు, ముక్తుమ్‌సాహేబ్, పింగళి శ్రీనివాసరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సై-2 వెంకటేశ్వరరావుకు మిత్రబృందం అభినందన

తిరువూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణం సెక్టార్-2 ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గార్లపాటి వెంకటేశ్వరరావును ఆయన మిత్రులు అభినందించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన ఎస్సైను ఆయనతోపాటు చదువుకున్న మిత్రులు గజ్జల సీతారామయ్య, భూమా కనకయ్య, దోసపాటి రవికుమార్, మోహన్‌రావు, దారా రాము, రవికుమార్, దేవిశెట్టి రాధాకృష్ణ శాలువకప్పి, ఫ్లవర్‌బోకే అందించి అభినందనలు తెలిపారు.

కళ్లజోళ్ల పంపిణీ

జగ్గయ్యపేట రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): జయప్రద ఫౌండేషన్ సహకారంతో మల్కాపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న 68 మందికి ఆదివారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్దన్ సహకారంతో కంటి లోపాలను గుర్తించిన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు నెట్టెం శివరామ్, వైవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సత్కారం

నందిగామ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వీరంకి వీరాస్వామిని మండలంలోని కొత్త కంచల, రాఘవాపురం పార్టీ నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. నేతలు చెన్నుపాటి సాంబశివరావు, గరివిడి సురేష్, సుబ్రహ్మణ్యం, యేసు, లక్ష్మణరావు, రామయ్య, నాగేశ్వరరావు, సాంబయ్య, కొండ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





కవులూరు - కట్టుబడిపాలెం రహదారి, శాంతినగర్ - కవులూరు గ్రామాల మధ్య గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

రహదారులు అధ్వానం





కుంటముక్కల గ్రామంలోకి వెళ్లే రహదారి, గడ్డమణుగు - చెర్వుమాధవరం మధ్య రహదారిలో ఏర్పడిన గుంతలు

జి.కొండూరు, ఆంధ్రజ్యోతి: మండలంలోని పలు గ్రామాలను కలిపే అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కురుస్తున్న వర్షాలకు పూర్తిగా పాడై అడుగడున గుంతలు పడ్డాయి. రెండు, మూడు మీటర్ల మేర వెడల్పాడి గుంతలుగా తయారయ్యాయి. దీంతో అటుగా వెళ్లే వాహన చోదకులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కవులూరు - కట్టుబడిపాలెం, కవులూరు - శాంతినగర్, కుంటముక్కల నుంచి కుంటముక్కల క్రాస్ రోడ్డు రోడ్డు, చెర్వుమాధవరం - గడ్డమణుగు గ్రామాల మధ్య నున్న అంతర్గత రోడ్లు వాహన రాకపోకలకు అనువుగా లేకుండా పోయాయి. అధికారులు స్పందించి తక్షణం వాటికి కనీస మరమ్మతులు చేయించకుంటే ఆయా రహదారుల్లో ప్రజలు ప్రయాణాలు చేసే వీలుండదని వాపోతున్నారు.

జుజ్జూరు - చెన్నారావుపాలెం రోడ్డు సైతం..

వీరులపాడు: జుజ్జూరు - చెన్నారావుపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. పలుచోట్ల గుంతలు పడి వర్షపు నీరు నిలబడుతున్నాయి. దీంతో గుంతల్ని తప్పించే క్రమంలో పలువురు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా తయారైందని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



జుజ్జూరు - చెన్నారావుపాలెం రోడ్డులో ఏర్పడిన గుంతలు

కొండపల్లిలో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ అవసరం!

- నిరుపయోగంగా ఉన్న పాత పోలీస్‌స్టేషన్ స్థలం
- అసాంఘిక శక్తుల అడ్డాగా మారిన భవనం
- మున్సిపల్ కేంద్రంలో పోలీస్‌స్టేషన్ అనివార్యం

ఇబ్రహీంపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి మున్సిపాలిటీ ముఖ్య కేంద్రం కొండపల్లిలో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. మాండలిక వ్యవస్థకు ముందు కొండపల్లిలోనే రైల్వేస్టేషన్ సమీపంలో పోలీస్‌స్టేషన్ ఉండేది. దీని కింద ఇబ్రహీంపట్నం, కొండపల్లితో పాటు మండలంలోని 10 గ్రామాలు ఈ స్టేషన్ పరిధిలో ఉండేవి. జి.కొండూరు మండలంలోని సగానికి పైగా ఈ స్టేషన్ పరిధిలో ఉండేవి. 1986లో ఎన్టీఆర్ మండలాల వ్యవస్థ తీసుకురావడంతో కొండపల్లి పోలీస్‌స్టేషన్ మూతపడింది. మండల కేంద్రంగా ఇబ్రహీంపట్నం ఏర్పాటైంది. దీంతో ఇబ్రహీపట్నంలో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు అయ్యాయి. అప్పట్నుంచి ఇక్కడున్న పోలీస్ స్టేషన్ మూతపడటమే కాక విలువైన అరెకరం వరకు స్థలం నిరుపయోగంగా పడి ఉంది. ప్రస్తుతం దానిలో ఒక గదిని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ అవుట్ పోస్టుగా వాడుతూ ఒక కానిస్టేబుల్‌ను ఉంచుతున్నారు. రాత్రి వేళల్లో గేట్ కూడా లేని ఈ స్థలంలో అసాంఘిక శక్తులు అడ్డాగా చేసుకొని చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చుట్టుపక్కనున్న గృహాల వారు ఆందోళన చెందుతున్నారు. ఇంత పెద్ద కొండపల్లికి కేవలం ఒక కానిస్టేబుల్ ఎలా సరిపోతాడనే సందేహం వ్యక్తమవుతోంది. ఇక్కడే ఒక ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఎందుకు నిర్మించకూడదని కొండపల్లి వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపాలిటీ ముఖ్య కేంద్రం కొండపల్లిలో ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జాపరం కాకుండా కాపాడాలని వేడుకుంటున్నారు.



కొండపల్లి పాత పోలీస్‌స్టేషన్



కేక్ కట్ చేసి ధన్యవాదాలు తెలుపుతున్న రేషన్ డీలర్లు

సీఎంకు, మంత్రికి డీలర్ల ధన్యవాదాలు

ఇబ్రహీంపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని రద్దు చేసి ఎప్పుడు కావాలిస్తే అప్పుడు కార్డుదారుడు రేషన్ షాపునకు వెళ్లి రేషన్ తీసుకునే విధానాన్ని పునఃప్రారంభించిన సీఎం చంద్రబాబు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఇబ్రహీంపట్నం మండల డీలర్లు ఆదివారం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తుమ్మలపాలెంలోని జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం ఇందిరా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ఈత శిక్షకులకు సర్టిఫికెట్ల ప్రదానం

జగ్గయ్యపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి సమీపంలో పాలేటి వద్ద ఏర్పాటు చేసిన వేసవి ఉచిత ఈత శిక్షణా శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న శిక్షకులకు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సామినేని దీపక్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. స్విమ్మింగ్‌కోచ్ దంపతులు పొట్టబత్తిన పాండు రంగారావు దంపతులు ఎంతో ఉదాత్తంగా ఈతలో శిక్షణతో పాటు వారిని పలు పోటీలకు సంసిద్ధం చేయటంపై డాక్టర్ దీపక్ ప్రత్యేకంగా అభినందించారు. అసోసియేషన్ ప్రతినిధులు కే నరేష్, ఏ రమేష్‌బాబు, ఎం శ్రీనివాసరావు, ఏ కల్యాణ్, పీ రమాదేవి, పీ సందీప్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరంలో

గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో ఆదివారం విద్యార్థులకు చత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్రను తెలియజేశారు. మెడిటేషన్, యోగాసనాలు వేయించారు. మ్యూజికల్ చైర్స్ గేమ్ ఆడించారు. గ్రంథాలయ పాలనాధికారి ప్రభ ఆధ్వర్యంలో డి.రామలక్ష్మీపతి, సిబ్బంది రమేష్, రాము పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఆర్ ఎస్సై లక్ష్మణరావు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ

ఇబ్రహీంపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం సీఐ ఎ.చంద్రశేకర్ అన్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ఆయన ఆర్ ఎస్సై బి.లక్ష్మణరావుతో కలిసి నాకాబందీ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న వాహనాలను ఆపి ప్రజలకు, వాహన చోదకులకు ఆయన అవగాహన కల్పించారు. పలు వాహనాలను తనిఖీ చేసి అపరాధ రుసుం విధించారు.

మంచిగా నడుచుకోవాలి

నందిగామ రూరల్: రౌడీషీటర్లు మంచి నడవడికతో మెలగాలని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేర చరిత్ర కలిగిన వారిపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచటం జరుగుతుందన్నారు. ఎస్‌ఐ అభిమన్యు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

తిరువూరు: ఎలాంటి వివాదాల్లోకి వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటర్లుగా నమోదైన వారికి సమాజంలో గుర్తింపు ఉండదని, మీ పిల్లల భవిష్యత్‌కు తీవ్ర ఆటంకంగా మారుతుందని వివరించారు. ఇప్పటికైనా వివాదాలకు దూరంగా సత్ప్రవర్తనతో నడుచుకుం ా, సమాజంలో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు, రౌడీషీటర్లపై పోలీస్ నిఘా నిత్యం ఉంటుందని, ఎవరైనా వివాదాలు సృష్టిస్తే, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్న వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

తోతాపురి ధర హరీ..!

టన్ను రూ.90 వేల నుంచి రూ.5వేలకు పడిన వైనం



విస్సన్నపేట మార్కెట్‌లో తోతాపురి మామిడి

విస్సన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల్ని ప్రతి ఏడాది ఆదుకుని నష్టాల ఊబి నుంచి బయట పడేసే తోతాపురి (కలెక్టర్) రకం మామిడి ధర ఈ ఏడాది భారీగా పడిపోయింది. రైతుల్ని నష్టాల పాలు చేసింది. సీజన్ ప్రారంభంలో టన్ను ధర రూ.90 వేలు పలికింది. 20 రోజుల్లోనే రూ.50వేలకు, మరో రెండు వారాల్లో కేవలం రూ.13 వేలకు పడిపోయింది. ప్రస్తుతం టన్ను ధర రూ.5వేలు మాత్రమే. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ధర పడిపోవడంతో తోటల్లోనే కాయలను వదిలివేస్తున్నారు. ఒక వేళ కోసినా కోత, రవాణా ఖర్చులు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. అకాల వర్షాలు, మంగు, రాణి పురుగుల కీటకాల దాడులు జ్యూస్ ఫ్యాక్టరీల మూసివేత వల్లే ధర పడిపోయేందుకు ప్రధాన కారణమని రైతులంటున్నారు. విదేశాలకు మామిడి ఎగుమతులు ఆగిపోవడం కూడా ధర పతనానికి కారణమని తెలుస్తోంది. కొండపర్వకు చెందిన పామర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 20 ఎకరాల్లో తోతాపురి సాగు చేశానని, ధర లేక తీవ్రంగా నష్టపోయానని, కాయలను తోటలనే వదిలేశానన్నారు. పంట బీమా చేయించాను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మరో రైతు తాతకుంటకు చెందిన దమ్మలపాటి సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



విస్సన్నపేట హైస్కూల్ పూర్వ విద్యార్థులు

విస్సన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం విస్సన్నపేటలో ఆత్మీయంగా కలుసుకున్నారు. 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకునినాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు.

రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సబ్సిడీ దాణా పంపిణీలో తాతయ్య



జగ్గయ్యపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చెప్పారు. ఆదివారం పట్టణంలో పశు వైద్యశాలలో నియోజకవర్గంలోని 500 మంది రైతులకు 50శాతం సబ్సిడీపై 50 కేజీల బ్యాగులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించనుందని చెప్పారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ భవానీ ప్రసాద్, పశు వైద్యులు లక్ష్మీప్రసన్న, శ్రీనునాయక్, మురళీకృష్ణ, రావూరి శ్రీను, గుమ్మా వెంకటేష్, పశుపోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై నల్లబెల్లం అందించండి

పశుపోషణకు ఉపయోగించే తాటి బెల్లాన్ని ప్రభుత్వం సబ్సిడీపై అందజేయాలని రైతులు తాతయ్యను కోరారు. బయట తాటిబెల్లం లేదా నల్లబెల్లం అమ్మకాలపై ఆంక్షలు ఉన్నందున వారానికి ఒకసారైనా వేయటానికి రైతులు బెల్లం దొరక్క ఇబ్బంది పడుతున్నారని, వ్యాపారులు తక్కువగా ఇస్తున్నందున పశువులకు అందించలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే తమకు అసరాగా ఉంటుందని, పాల ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తాతయ్య హామీ ఇచ్చారు.

తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదివారం ఉదయం క్యూ లైన్స్‌లో బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాలు, మునేటి అవతల వైపున్న మామిడి తోటలు భక్తులతో కిటకిటలాడాయి. ట్రాఫిక్‌ను ఎస్సై ఎంఎస్‌కే అర్జున క్రమబద్ధీకరించారు.

గుంటూరు వాసుల విరాళం

తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా నిడుముక్కల గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మావతి కుటుంబ సభ్యులు రూ.15వేల విరాళాన్ని ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావుకు ఆదివారం అందించారు. దాతలకు అమ్మవారి, స్వామి వారి శేషవస్త్రాలను అందించారు. ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

మఠం శివాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జగ్గయ్యపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాలేటి ఒడ్డున నిర్మిస్తున్న మఠం శివాలయం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన నక్కని రాజయ్య ఎయిడెడ్ స్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎన్వీఎస్ రంగనాయకులు సంస్మరణార్థం ఆయన భార్య రమాదేవి, కుమార్తెలు రూ.1,00,116 విరాళాన్ని ఆదివారం తమ నివాసంలో ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. రమాదేవి కుమార్తెలు, మనుమలు పాల్గొన్నారు.